విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 21 సెప్టెంబరు 2024 8 పేజీలు

స్టాంపు, రిజిస్ట్రేషన్ శాఖలో

ప్రైవేటు పెత్తనం

- స్టాంప్ డ్యూటీ చెల్లిస్తేనే ఏజెన్సీలకు సరఫరా
- నాన్ జ్యూడిషియల్ స్టాంపులదీ అదే పరిస్థితి

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రైవేటు పెత్తనం కొనసాగుతోంది. వారు జారీ చేస్తేనే స్టాంపులు వేసుకునే దుస్థితి నెలకొంది. రెండు వారాలుగా జిల్లాలలో ఈ-స్టాంపుల కొరత ఏర్పడింది. దీంతో క్రయ, విక్రయదారులు ఇక్కట్లు పడుతున్నారు. అదనపు ధరలకు విక్రయించినా ఇన్నాళ్లు కొనుగోలు చేశారు. ఇప్పుడేమో నో స్టాక్ అంటున్నారు. 2022 లో వైసీపీ ప్రభుత్వం ఈ- స్టాంపింగ్ విధానాన్ని తెచ్చింది. వాటి బాధ్యతను ప్రైవేటు సంస్థలకు అప్పగించింది. కామన్ సెంటర్ సర్వీస్(సి.ఎస్. సి),స్టాక్ హెూల్డింగ్ కంపెనీలే ఈ-స్టాంపులు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేసింది.వాటిపై ప్రభుత్వానికి ఎలాంటి అధికారం ఉండదు.దీంతో ఈ-స్టాంపులను ఆ సంస్థలు, ఏజెన్సీ దక్కించుకున్న వారు మాత్రమే విక్రయిస్తున్నారు. కొంత కాలంగా నాన్ జ్యుడీషియల్ స్టాంపులు కనిపించ డం లేదు. కనీసం రూ.10 స్టాంపులు దొరికినా చాలని బాధితులు వేచి చూసే పరిస్థితి నెలకొంది.

దోపిడీ వ్యూహమా?

ఈ-స్టాంపుల విషయంలో రెండు ప్రైవేటు సంస్థలు కుంభకోణానికి తెర లేపాయా...? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి.కృత్రిమ కొరత సృష్టించి అదనపు డబ్బులు వసూలు చేసే ఉద్దేశంతో ఈ తతంగాన్ని నడిపిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. సాధారణ అవసరాల కోసం ప్రజలు రూ.10,20 ఈ-స్టాంపులను కొనుగోలు చేస్తుంటారు. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ కోసం రూ.50, రూ.100 ఈ-స్టాంపులు కొంటుం టారు. ప్రస్తుతం స్టాంపులు ▶మిగతా 2లో..

స్కానింగ్ సెంటర్లపై నిఘా

విశాలాంధ్ర - కాకినాడ : అల్ట్రాసౌండ్ స్కానింగ్ ప్రక్రియను గర్భస్థ పిండ లింగ నిర్ధారణల కోసం దుర్వినియోగం కాకుండా నివారించేందుకు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిశితమైన నిఘా, పర్యవేక్షణలు కొనసాగించా లని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టు హాలులో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, వెల్లడి నిషేధ చట్టం (పిసి అండ్ పిఎన్డిటి యాక్ట్), ఏఆర్టి అండ్ సర్రోగసీ యాక్ట్ల అమలు పై జిల్లా స్థాయి సలహా, సాధికార కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భస్థ పిండ ఆరోగ్య పరిశీలన, సంరక్షణ కోసం నిర్దేశించిన అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరిక్షా విధానం పిండ లింగ నిర్ధారణకు దుర్వినియోగం చేయడం చట్టప్రకారం శిక్షార్హమైన నేరమన్నారు. దీనిని నిషేధిస్తూ చేసిన చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. చట్టం ▶మిగతా 2లో..

కామాంధుడు శశి కుమార్ అరెస్టు : ఎస్పీ

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మైనర్ బాలికలను మాయమాటలు చెప్పి లోబరుచుకొని అత్యాచారం చేస్తూ వారి జీవితాలను నాశనం చేస్తున్న కామాంధుడిని ఎట్టకేలకు ఏలూరు టూ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. మైనర్ బాలికల జీవితాలను ఉద్ధరించే విధంగా ఆదరణ కరువైన బాలికలకు వసతి అందించే పేరుతో అత్యాచారాలకు పాల్పడుతున్న బీసీ వెల్ఫేర్ అధికారి శశి కుమార్ బాగోతం గత నాలుగు రోజుల క్రితం వెలుగు చూడడంతో పోలీసులు ఈ కేసును చాలెంజ్ గా తీసుకొని వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఏలూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పి కె ప్రతాప్ శివ కిషోర్ నిందితుడిని అరెస్టు చూపించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అమీనాపేట ప్రాంతంలో అనధికారికంగా నడుపుతున్న శ్రీ స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం హాస్టల్ లో ఉంటూ 8వ తరగతి చదువుతున్నట్లు ఒక మైనర్ బాలికను హాస్టల్ వార్డెన్ ఫణిశ్రీ, కేర్ టేకర్ లావణ్యలు బలవంతంగా వార్డెన్ భర్త అయిన బొమ్మిరెడ్డిపల్లి ▶మిగతా 2లో..

నీటి పాట్లు

- ఉప్పుటేరు పరివాహక ప్రాంతాల్లో మంచినీటికి అవస్థలు
- నాటుపడవలపై వెళ్లి బిందెలతో మోసుకొస్తున్న మహిళలు

విశాలాంధ్ర - కైకలూరు : ప్రభుత్వాలు మారుతున్నా కొల్లేటి లంక గ్రామాల ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు బుడమేరు ఉగ్రరూపంతో ఎగువ నుంచి వచ్చిన వరద నీరు కొల్లేరు గ్రామాలు ఇంకా నీళ్లలోనే నానుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన లేదని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు మండలం లోని కొట్టాడ గ్రామ పంచాయతీ శివారు ఉప్పుటేరు పరీవాహక దళితవాడ, జంగంపాడు, పల్లెపాలెం గ్రామాల ప్రజలు నాటు పడవలపై ఉప్పుటేరు దాటి పశ్చిమగోదావరి జిల్లా దుంపగడప నుంచి మంచినీటిని తెచ్చుకుంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొల్లేటి గ్రామాలకు మంచి నీటి సౌకర్యం లేకపోవడం,వరదలకు గ్రామాల రహదారులు మునగడంతో గ్రామాలకు నీటి సరఫరా చేసే ఆటోలు రావడం లేదని దీంతో స్థానికులు ప్రమాదకర పరిస్థితుల్లోనే ఉప్పుటేరును దాటి నీటిని తెచ్చుకుంటున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భారతీయ సంస్కృతిలో హస్తకళలు ఒక భాగం : ఎంపీ

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : మన భారతీయ సంస్కృతితో ముడిపడి వున్న హస్త కళలను కాపాడుకుంటూ ఆ వృత్తుల మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ప్రోత్సాహాన్ని అందించే దిశగా పీఎం విశ్వకర్మ అనే బృహత్తర కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ పి. ప్రశాంతి పేర్కొన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ మొదటి ఏడాది పురోగతి ప్రారంభ కార్యక్రమంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వాలంబి గ్రౌండ్, వార్ధా, మహారాష్ట్ర నుంచి పాల్గొన్నారు. జిల్లా స్థాయి కార్యక్రమం స్థానిక నిజాంపేట ఉమా రామలింగేశ్వర కల్యాణ మండపం నుంచి వర్చువల్ విధానంలో

వీక్షించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ పి. ప్రశాంతి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఆధునిక ఉపకారణాల్లో నైపుణ్యత, అభివృద్ధికి మార్గ సూచికని, నైపుణ్యం తోనే దేశం నవనిర్మాణ దిశగా సాధ్యమవు తుందన్నారు. భారతీయ ▶మిగతా 2లో..

ఉచిత ఇసుక పోర్టల్ ప్రారంభం

ఆన్‌లైన్‌లో ఉచిత ఇసుకను పొందడం ఇక సులభతరం
కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర-భీమవరం: రాష్ట్ర ప్రజలు సులభంగా ఉచిత ఇసుకను పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను అందు బాటులోకి తీసుకు వచ్చిందని కలెక్టర్ చదల వాడ నాగరాణి తెలి పారు. ఇసుకను ఉచితంగా ఇవ్వ డమే కాకుండా ఆ ఇసుకను కేవలం రవాణా, నిర్వహణ చార్జీలను మాత్రమే చెల్లించి ఇంటి వద్దకే దిగుమతి చేసే సదుపాయంను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి ▶మిగతా 2లో..

ట్రిబుల్ ఐటీని సందర్శించిన ఉన్నతాధికారుల బృందం

విశాలాంధ్ర- నూజివీడు :నూజివీడు ట్రిబుల్ ఐటీని శుక్రవారం రాష్ట్ర ఉన్నతాధికారుల కమిటీ సందర్శించింది. రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కార్యదర్శి, కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్, ఉన్నత విద్యాశాఖ చైర్మన్ కే రామ్మోహనరావు, ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి, నూజివీడు ఆర్డీవో భవాని శంకరిలు ట్రిబుల్ ఐటీని సందర్శించిన వారిలో ఉన్నారు. తొలుత ట్రిబుల్ ఐటీ సమావేశ హాలులో ట్రిబుల్ ఐటీ లో ఉన్న సమస్యలు, వస్తున్న ఫిర్యాదులపై సమావేశం నిర్వహించారు. అనంతరం ట్రిబుల్ ఐటీ మెస్సులను, కిచెన్, స్టోర్ రూమ్,డైనింగ్ హాల్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం చేస్తున్న విద్యార్థులతో ముఖా ముఖి మాట్లాడిన అధికారులు ఆహార నాణ్యత తదితర అంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో కళాశాల విద్యా కమిషనర్ భాస్కర్ మాట్లాడుతూ ట్రిబుల్ ఐటీ లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పన విషయంలో స్వల్పకాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కిచెన్‌లకు అనుబంధంగా స్టోర్స్,మెస్ కమిటీలు ఉండాలని ఈ కమిటీలలో ఫ్యాకల్టీ, విద్యార్థులను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించే క్రమంలో రోజువారి తనిఖీలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కలెక్టర్ నెలకు ఒకసారి ఫుడ్ ఇన్స్పెక్టర్లను ట్రిబుల్ ఐటీ మెస్‌లకు పంపించి ఆహార పరీక్షలు చేయించనున్నట్లు తెలిపారు. తులాటిలో ముందుగా కిచెన్, స్టోర్స్, డైనింగ్ హాల్‌ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆదేశించామని ఆయన పేర్కొన్నారు.

ప్రజాక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర -నూజివీడు :ప్రజల మంచిని ఆకాంక్షించి ప్రజా ఆశీస్సులతో అఖండ విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏర్పరచి 100 రోజుల్లోనే ప్రధానమైనటువంటి హామీలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అవ్వతాతల పెన్షన్లను 4 వేలకు పెంచుతానని ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల్లో బకాయిలతో కలిపి మొత్తం పింఛను ఇస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే అమల్లోకి తీసుకువచ్చి అవ్వ తాతల రుణాన్ని తీర్చుకున్నాడు అన్నారు. పేదలకు పట్టెడన్నం పెట్టలేని జగన్ రెడ్డి,గత ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ లతో ఎటువంటి చెత్త పనులు చేసిందో ఒక్కొక్కటి వెలుగులోకి వస్తుంటే నమ్మశక్యం కాని పరిస్థితి ఎదురవుతోందని, చివరికి దైవ సేవలోనూ నాసిరకపు ఆహార పదార్థాలను వినియోగించారంటే జగన్‌కు దేవుడంటే కూడా భయం లేదని అర్థమవుతుందన్నారు.

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలి

విశాలాంధ్ర -మొగల్తూరు : గ్రామ పరిరక్షణ కోసం పౌరులందరూ ఒక్కో మొక్క నాటాలని శేరేపాలెం గ్రామ సర్పంచ్ తణుకుల మునేశ్వర రావు అన్నారు. శుక్రవారం మొగల్తూరు మండలం శేరేపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రతి ఒక్కరు ఒక్కో మొక్క నాటి గ్రామాన్ని కాలుష్య రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి చందూరి బాలాజీ, జనసేన గ్రామ పార్టీ అధ్యక్షులు కొండేటి తాతాజీ,టీడీపీ గ్రామ అధ్యక్షుడు దూసనపూడి రమేష్ ,గ్రామ కార్యదర్శి సేవా కిషోర్, జనసేన టిడిపి నాయకులు కార్యకర్తలు గ్రామ సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ కార్మికులు, డ్వాక్రా సంఘ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

హస్తకళలు

(1వ పేజీ తరువాయి)

సంస్కృతిలో హస్త కళలు ఒక భాగం అన్నారు. విశ్వకర్మ పథకం ద్వారా రూ .500 ఉపకార వేతనం, శిక్షణ పూర్తయిన తర్వాత రూ .15 వేల కిట్స్ అందించడంతో పాటు బ్యాంకుల ద్వారా లక్ష రూపాయల రుణ సౌకర్యం అందిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ, ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా కులవృత్తులను ప్రోత్సహించే ఉద్దేశంతో నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ ఫ్లాట్ ఫారంకి తీసుకువచ్చినట్టు తెలిపారున బీజేపీ మాజీ అధ్యక్షులు సోము వీర్రాజు మాట్లాడుతూ పి ఎం విశ్వకర్మ పథకం లో శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్స్‌ను అందించి రు. లక్ష రూపాయల రుణాన్ని కూడా అందించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సోము వీర్రాజు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ డివి ప్రసాద్ , యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ ఎ. విశ్వేశ్వరరావు, ఎస్బిఐ ఆర్ ఎం శ్రీనివాసరావు, స్కిల్ డెవలప్మెంట్ జెడి శాంతి, శ్రీ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ మునుసూరి సునీల్, డిఎస్టిఓ కొండలరావు, ఓబిసి సతీష్, బి జెపి స్టేట్ ప్రెసిడెంట్ రేలంగి శ్రీదేవి, విశ్వకర్మ ప్రోగ్రాం ఆర్గనైజర్ సత్య సాయి, డి ఆర్ డి ఎ పీడీ - ఎన్ వివిఎస్ మూర్తి, లబ్దిదారులు పాల్గొన్నారు.

అరెస్ట్

(1వ పేజీ తరువాయి)

శశి కుమార్ తో కారులో పంపగా అతను ఆ మైనర్ బాలికను బాపట్ల తీసుకువెళ్లి అక్కడ ఆమెపై అత్యాచారం చేసి ఏలూరు తీసుకొచ్చాడు. దీంతో ఆ మైనర్ బాలిక తోటి బాలికల సహాయంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఫోక్సో, అత్యాచార చట్టంతో పాటు పలు సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మైనర్ బాలిక మీద అత్యాచారం చేశాడన్న వార్త దావానంలా వ్యాపించడంతో జిల్లా వ్యాప్తంగా ఈ సంఘటన తీవ్ర చర్చనీయాంసమైంది. దీంతో శశి కుమార్ పరారవ్వగా జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్ ఆదేశాలతో ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు 2 టౌన్ సిఐ వెంకట రమణ తమ సిబ్బందిని బృందాలుగా ఏర్పాటు చేసి ముద్దాయి శశి కుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు శశి కుమార్, వసతిగృహం వార్డెన్ మరియు నిందితుడి భార్య బొమ్మిరెడ్డిపల్లి ఫణి శ్రీ, కేర్ టేకర్ బయ్యవరపు లావణ్యలు గ్రీన్ సిటీలో ఉన్నారనే సమాచారంతో వారి నివాసం వద్ద అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఏలూరు టూ టౌన్ ఇన్స్పెక్టర్ వైవి. రమణ, ఎస్బి ఇన్స్పెక్టర్ బి.ఆది ప్రసాద్, నిడమర్రు ఇన్స్పెక్టర్ ఎం.సుభాష్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం.సుబ్బారావు, మహిళా ఎస్సై లావణ్యలను ఎస్పి కిషోర్ ఈ సందర్భంగా అభినందించారు.

నిఘా

(1వ పేజీ తరువాయి)

అమలు ద్వారా సమాజంలో అవాంఛనీయమైన ఆడ బిడ్డల పట్ల వివక్ష, భ్రూణ హత్యలు గణనీయంగా తగ్గాయన్నారు. జిల్లాలో గడచిన ఏప్రియల్ నెల నుండి సెప్టెంబరు వరకు అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లలో 192 తనిఖీలు, 16 రహస్య డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారని, ఎక్కడా చట్ట ఉల్లంఘనలు నమోదు కాలేదన్నారు. సమావేశంలో క్రొత్తగా 4 అల్ట్రాసౌండ్ సెంటర్ల రిజిస్ట్రేషన్, 3 సెంటర్లకు అనుమతుల రెన్యూవల్, 5 సెంటర్లలో యంత్రాలు, సిబ్బంది, అడ్రసు మార్పులు, ఒక సెంటర్ మూసివేత తదితర అనుమతులు కోరుతూ అందిన దరఖాస్తులను కమిటీ ఆమోదించింది. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ కె శ్రీలక్ష్మి, డిఎఫ్ఓ ఎస్ భరణి, డియంహెచ్ఓ జె నరసింహానాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ కెపి సరిత, డిఐఓ ఇన్చార్జి ఆర్.శ్రీనివాసనాయక్, డిమో రాజు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కరణం వెంకటేశ్వరరావు, ఎస్ అప్పలనాయుడు, ఎండి బేబీ సోఫూర, జిజిహెచ్ శిశు, ప్రసూతి విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

పెత్తనం

(1వ పేజీ తరువాయి)

ఎక్కడా అందుబాటులో లేవు.జిల్లా వ్యాప్తంగా 100 మందికి పైగా కామన్ సర్వీస్ సెంటర్(సి.ఎస్. సి),స్టాక్ హోల్డింగ్ కంపెనీలు ఏజెన్సీలు అప్పగించారు. రూ.50 స్టాంపుకు అదనంగా రూ.30,రూ.100 స్టాంపుకు అదనంగా రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేస్తున్నారు. సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఒక్క స్టాంపు కూడా ఇవ్వడం లేదు.ప్రభుత్వ జోక్యం లేకపోవడంతో ప్రైవేటు ఏజెన్సీలు ఆడింది ఆట.. పాడింది పాటగా మారింది. ఉమ్మడి జిల్లాలో పలు సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఇదే తంతు కొనసాగుతోంది.

ఇతర జిల్లాలకు వెళ్లి....

జిల్లాలో ఈ- స్టాంపులు లభించకపోవడంతో కొందరు ఇతర జిల్లాలకు వెళ్లి కొంటున్నారు. కొన్ని ప్రాంతాల లో నెలల తరబడి స్టాంపులు కొరత ఉంది.ఈ-స్టాంపులు ఎక్కడ నుండి తెచ్చుకున్నా రిజిస్ట్రేషన్ చేయిస్తామని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. రెండు ప్రైవేటు సంస్థలు తమ ఏజెన్సీ నిర్వాహకులకు ఓ విషయం సూటిగా చెబుతున్నట్లు సమాచారం. రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్ డ్యూటీ మీ నుంచి చెల్లిస్తే మీకు 300 నుంచి 500 ఈ-స్టాంపులు అందజేస్తాం. లేదంటే ఈ- స్టాంపులను ఇవ్వం అంటూ హుకుం జారీ చేస్తున్నట్లు తెలిసింది. స్టాంపు డ్యూటీ నుండి సి.ఎఫ్. ఎం.ఎస్.ద్వారా చెల్లించాలి.కానీ ఏజెన్సీ నిర్వాహకుల నుంచి స్టాంపు డ్యూటీ వచ్చేలా ప్రైవేట్ సంస్థలు ప్లాన్ చేసి సొమ్ము చేసుకోవాలని చూస్తున్నట్లు తెలుస్తోంది.ఇదే కారణంగా ఏజెన్సీ నిర్వాహకులకు ఈ-స్టాంపులు ఇవ్వకుండా బ్రేక్ వేశారని సమాచారం.

నాన్ జ్యుడీషియల్ స్టాంపులు ఎక్కడ?

నాన్ జ్యుడీషియల్ స్టాంపులను పూర్తిగా నిలిపివేయడం పైనా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దేశం మొత్తం మీద నాసిక్ లో మాత్రమే వీటిని తయారు చేస్తారు.రాష్ట్ర ప్రభుత్వాలు తమ అవసరాలకు సరిపడా నాన్ జ్యుడీషియల్ స్టాంపులకు ఇండెంట్ ఇచ్చి తెప్పించుకుంటాయి.అవి ప్రభుత్వానికి చేరిన తరువాత జిల్లా రిజిస్ట్రార్లకు పంపిస్తారు. అనంతరం వారి నుంచి సబ్ రిజిస్ట్రార్లకు వెళతాయి. అక్కడి నుంచి కార్యాలయాలలో కొన్ని నిల్వ ఉంచి,స్టాంప్ వెండర్లకు ఇచ్చేవారు. అయితే ఆ స్టాంపులు ఇప్పుడు కనిపించడం లేదు.రూ.100 విలువైన నాన్ జ్యుడీషియల్ స్టాంపు కనిపించక రెండేళ్లవుతుందని డాక్యుమెంట్ రైటర్లు తెలిపారు. ప్రభుత్వం ఇకనైనా స్టాంప్, రిజిస్ట్రేషన్ శాఖను ప్రక్షాళన చేసి అందరికీ ఈ స్టాంప్ లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

విద్యా ప్రమాణంతోనే దేశ ప్రగతికి నాంది

విశాలాంధ్ర-పాలకోడేరు: విద్యా ప్రమాణంతోనే దేశ ప్రగతికి నాంది అని, మేధావులు కృషితోనే దేశంలో ఎన్నో పరిశ్రమలు ముందుకు వస్తున్నాయని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణం రాజు పేర్కొన్నారు. శుక్రవారం పాలకోడేరు మండలం మొగల్లు గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్స్ శాస్త్రవేత్త ఈసిఐఎల్ వ్యవస్థాపకులు ఏఎస్ రావు 110 వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భీమవరం ఎస్ ఆర్ కె ఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం సుమారు ఐదు లక్షల రూపాయల వ్యయంతో మొగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నూతనంగా ఆటస్థలం ఏర్పాటు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేసిన సందర్భంగా వాటిని కూడా ఎమ్మెల్యే రఘురామ కృష్ణమరాజు ప్రారంభించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యా యులు ఎం.వి త్రినాధులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారు 50 పాఠశాలల్లో ఆట స్థలాల అభివృద్ధి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. సుమారు 2000 మంది విద్యార్థులకు అవసరమైన బెంచీలు కూడా సిద్ధం చేసి విద్యార్థు లకు అందిస్తామని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్ ఆర్ కే ఆర్ ఇంజనీరింగ్ కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్య ప్రతీక్ వర్మ మాట్లాడుతూ రఘురామ కృష్ణంరాజు సూచనలతో పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేశామని చెప్పారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు,ఇన్చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ బి హెచ్ వి ఎస్ రామకృష్ణంరాజు, ఎస్ ఆర్ కె ఆర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ సిహెచ్ దిలీప్ చక్రవర్తి, ఏఎస్‌రావు, జయంతి ఉత్సవాల కోఆర్డినేటర్ పివిపి మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు బస్సుల్లో సీట్లు కేటాయించాలి

విశాలాంధ్ర -భీమవరం: వృద్ధులకు బస్సుల్లో నాలుగు సీట్లు కేటాయించాలని, వృద్ధులకు సంబంధించిన అన్ని గుర్తింపు కార్డులను పరిగణనలోకి తీసుకోవాలని సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ సభ్యులు ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్.వి.ఆర్. వరప్రసాద్, ఇన్ చార్జి డిపో మేనేజర్ వై.సురేష్ లకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సిటిజన్ సభ్యులు ఆర్ఎం, డిపో మేనేజర్ లను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిటిజన్ ఫోరం ప్రతినిధులు ప్రొఫెసర్ మట్లపూడి సత్యనారాయణ, పెన్మెత్స రామకృష్ణంరాజు, బోనం పాండురంగా రావు, తాళ్లపూడి గాంధీ, డాక్టర్ కట్రెడ్డి సత్యనారాయణ, వినుకొండ పాండురంగారావు, బి.వి.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోర్టల్ ప్రారంభం

(1వ పేజీ తరువాయి)

తెచ్చిందన్నారు. ఉచితంగా ఇసుకను పొందటానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్ పోర్టల్‌లో నమోదు చేసుకుని రవాణా చార్జీలు చెల్లించి ఇసుకను పొందవచ్చు నన్నారు. వినియోగదారులు సంబంధిత నిర్మాణ అనుమతులు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా ఇసుక లభ్యతను బట్టి 24 గంటలు బుకింగ్ చేసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఇసుకను ఆన్లైన్ లో బుక్ చేసుకొన్న అనంతరం గనులు, భూగర్భ శాఖ వద్ద నమోదైన వాహనంలో మాత్రమే ఉచిత ఇసుక రవాణాకు అనుమతించడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుని స్వంత వాహనం లేదా వారి ద్వారా ఏర్పాటు చేసుకున్న వాహనం లేదా గనుల శాఖ ఏర్పాటుచేసిన వాహనం వీటిలో ఏదైనా గనుల శాఖ వద్ద వాహనం నమోదు తప్పనిసరి అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలసిందిగా జిల్లా కలెక్టర్ కోరారు.

సీపీఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణ వర్ధంతి

విశాలాంధ్ర - కామవరపుకోట: సీపీఐ సీనియర్ నాయకులు వంగా జయ సూర్యనారాయణ వర్ధంతి సిపిఐ, ఏఐటియుసి ఆధ్వర్యంలో కామవరపుకోటలో ఘనంగా నిర్వహించారు.

ముందుగా సిపిఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు సూర్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కోడిగంటి సోమరాజు అధ్యక్షతన జరిగిన ఈ సభలో టీవీఎస్ రాజు మాట్లాడుతూ వంగా జయ సూర్యనారాయణ తాను కలిసి యువజన సమాఖ్య కార్యక్రమాల్లో పరిచయమయ్యామని ఆ తర్వాత పార్టీ నిర్వహించిన అనేక కార్యక్రమాల్లో ఇద్దరం కలిసి పని చేశామన్నారు. సూర్యనారాయణ సిపిఐ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యునిగా, పాలకొల్లు పట్టణ కార్యదర్శిగా వివిధ ప్రజాసంఘాల బాధ్యునిగా సేవలందించా రన్నారు. పాలకొల్లు పట్టణంలో చేనేత కార్మికుల హక్కుల సాధన కోసం చేనేత కార్మికులను సంఘటిత పరిచి వారి హక్కుల కోసం ఉద్యమించిన మహనేత సూర్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు దుర్గాప్రసాద్, ఏలూరి ప్రసాద్, రాజు, నల్లమోతుల శేషం రాజు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలి

విశాలాంధ్ర - నూజివీడుటౌన్: కాంట్రాక్ట్ సిబ్బంది జీతాలు,పిఎఫ్ లు ఎకౌంట్ లో పడకపోతే సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో

పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, సూపర్వైజర్లు పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని కోరుతూ హాస్పిటల్ ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ కార్మికులకు గుత్తేదారులు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదన్నారు. నాలుగు నెలల నుండి జీతాలు పెండింగ్ లో ఉండటంవల్ల కార్మికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ జీతాలు వెంటనే వారి అకౌంట్లో జమ చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించి కార్మికులకు సంబంధించి గుత్తేదారు వ్యవస్థను రద్దు చేయాలని, పురపాలక కార్మికుల తరహాలో ఆప్కాస్లో కలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు మదుపల్లి నాగేంద్ర రావు, ఏరియా హాస్పిటల్ శానిటేషన్ కార్మికులు పద్మావతి, రమాదేవి, మణి, సత్యవతి, రషీద, సుమలత,అజయ్, సిమోను, శ్రీను, కనకంబరం, సెక్యూరిటీ సిబ్బంది ఏలియా, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

గణపవరంలో ఒడిశా రాష్ట్ర మత్స్యశాఖ సాంకేతిక సిబ్బంది పర్యటన

విశాలాంధ్ర - గణపవరం: ఒడిశా రాష్ట్రానికి చెందిన మత్స్య శాఖ నుంచి నూతనంగా రిక్రూటైన 22 మంది నూతన సాంకేతిక సిబ్బంది క్షేత్ర పరిశీలన, అక్వా కల్చర్లో పాటిస్తున్న మెళకువలు తెలుసు కొనే నిమిత్తం శుక్రవారం గణపవరం మండలంలోని

కేశవరం, అర్ధవరం గ్రామాలను సందర్శించి ఇక్కడ పాటిస్తున్న మెలుకువలు ఆక్వా రైతులను అడిగి తెలుసుకున్నారు. కథ నాలుగు రోజులుగా వివిధ మండలాలు తిరిగి నేడు గణపవరం చేరుకున్నారు. అనంతరం ఈ టీము బాదంపూడి మత్స్య శిక్షణ కేంద్రానికి చేరుకుంటారు. వారి టీం కో ఆర్డినేటర్స్ మనోరంజన్ మహపాత్ర, జగదీష్, గణపవరం మత్స్య శాఖ అభివృద్ధి అధికారి ఎన్ శివరామకృష్ణ, గ్రామ మత్స్య సహాయకులు బొంకు షర్మిల దేవి, నాగేంద్ర, ఆక్వా రైతులు సీతారామరాజు, రమేష్ రాజు,రామచంద్ర రాజు తదితరులు ఒడిషా బృందానికి ఇక్కడ సాగు పద్ధతులు వివరించారు.

కోమటిలంకకు రహదారి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

విశాలాంధ్ర - కైకలూరు : ఆటపాక నుండి కోమటిలంక వెళ్లే దారిలో పోల్ రాజ్ కాలువపై ఏళ్లతరబడి వంతెన నిర్మాణం జరగక రవాణాసౌకర్యం అందుబాటులో లేక వరద ముంపు ప్రాంతాలలో గత 20 రోజుల నుండి చిన్నారులు, విద్యార్థులు, ప్రజలు పడవల్లోనే ప్రయాణించాల్సి రావటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ముంపుతగ్గిన వెంటనే వంతెన నిర్మాణానికి ప్రభుత్వం,ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్. భాస్కరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆటపాట పక్షుల కేంద్రం వద్ద ముంపునకు గురైన కోమటిలంకకువెళ్లే దారిని, వరద నీటిలో పడవల ప్రయాణాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ ఏలూరు రూరల్ మండల పరిధిలో ఉన్న కోమటిలంక కైకలూరు మండలం ఆటపాకకు సుమారు 1.కిలో మీటరు, కైకలూరుకు2 కిలో మీటర్ల దూరంలో

దగ్గరగా ఉండడం ఏలూరు రూరల్ జిల్లా కోమటిలంక గ్రామానికి చెందిన 700 మంది గ్రామస్తులు, సుమారు 70 మంది ప్రైమరీ పాఠశాలల చిన్నా రులు, కళాశాలల విద్యార్థులు విద్యా భ్యాసం కోసం వీరితోపాటు వైద్యం కోసం నిత్య అవసరాల కోసం ప్రజలు కైకలూరు రావాల్సిందే.

గత 20 రోజుల నుండి ప్రమాద కరమైన పడవ ప్రయాణం చేస్తున్నారు. కోమటి లంక గ్రామంలో కనీసం ప్రైమరీ పాఠశాల కూడా లేదు. వేసవిలోతప్ప వర్షాకాలంలో చాలా రోజులుగా పడవల ప్రయాణమే శరణ్యం. గ్రామస్తుల సహకారం, కృషితో 1999 సంవత్సరంలో పక్షుల కేంద్రం గట్టుప్రక్కనుండి గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరిగింది.

అప్పటినుండి ప్రజా ప్రతినిధులు వంతెన నిర్మాణం చేపడతామని ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదు. కూటమి ప్రభుత్వ నాయకులు కూడాఎన్నికల్లో వాగ్దా నం చేశారని,వారైనా వంతెన నిర్మాణం చేపట్టి వాగ్దానాన్ని నెరవేర్చాలని కోమటి లంక గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రజా ప్రతి నిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టి కోమటి లంక గ్రామానికి రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు రవాణా భద్రత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలల సంరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-భీమవరం: బాలల, మహిళల సంరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయవలసిన బాధ్యత మన అందరిపై ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ కేశల అప్పారావు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టరేటు మీకోసం సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బాలల, మహిళల సంరక్షణ చట్టాలను కట్టుదిట్టంగా అమలు, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత జిల్లా అధికారులతో కలిసి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్పర్సన్ కేశల అప్పారావు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ డాక్టర్ కేశల అప్పారావు మాట్లాడుతూ యువత చదువుతో పాటు చెడు వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, ఇది చాల దురదృష్టకరం అన్నారు. ప్రతి రోజు వివిధ మీడియా మాధ్యమాలలో ఇటువంటి వార్తలు వస్తూనే ఉన్నాయని, ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలన్నారు. బాల్య వివాహాలు వలన కలిగే నష్టాల గురించి కౌన్సెలింగ్ నిర్వహించి, బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం బాల్య వివాహం చేసుకుంటే విధించే శిక్షలు రెండు సంవత్సరాలు జైలు శిక్ష, లక్ష రూపాయలు వరకు జరిమానా ఉంటుందని అవగాహన కల్పించాలన్నారు. నేటి యువత గంజాయి,మత్తు పదార్థాలకు ఎక్కువ అలవాటు పడుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదంతో అణగతొక్కటానికి అహర్నిశలు కృషి చేస్తుందన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని చైర్మన్ ప్రారంభించారు. చిన్నారులు, బాలికల

సంరక్షణపై అందరి చేత ప్రతిజ్ఞను చైర్మన్ చేయించారు. పవర్ పాయింటు ప్రజెంటేషన్ ద్వారా విపులంగా వివరించారు. రాష్ట్ర బాల హక్కుల కమీషన్ చైర్మన్ కేశల అప్పారావును వివిధ శాఖల అధికారులు ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కు కమీషన్ సభ్యులు డా.జె రాజేంద్ర ప్రసాద్, ప్రాంతీయ బాలల సంరక్షణ తనిఖీ అధికారి సి.హెచ్. వెంకటపతి రాజు,జిల్లా ఐసిడియస్ అధికారి బి.సుజాతారాణి,జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్.రాజేష్, జిల్లా సర్వశిక్ష అభియాన్ పివో వి.శ్యామ్ సుందర్, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై ప్రమాద హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : ఇటీవల తల్లాడ నుండి దేవరపల్లి వరకు నిర్మించిన జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయని, రహదారికి ఇరువైపులా స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేసి, ప్రమాద హెచ్చరిక బోర్డులను నిర్మించాలని, బయ్యనగూడెం గ్రామానికి చెందిన కూటమి పార్టీల నాయకులు, పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. మండలంలో బయ్యనగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి మధ్యలో డివైడర్ నిర్మించడం జరిగిందని, రహదారికి ఇరువైపులా స్ట్రీట్ లైట్లు వెలగకపోవడంతో, ప్రమాద హెచ్చరిక బోర్డు లేక పోవడంతో, వాహన చోదకులకు డివైడర్ కనిపించక, వాహనాలతో ప్రమాదాలకు గురవుతున్నారని, కేవలం అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

కారణంగా ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయని బాలం నరేష్ శాసనసభ్య లకు తెలియజేశారు. ఈ విషయంపై శాసనసభ్యులు చిర్రి బాలరాజు సానుకూలంగా స్పందిస్తూ, జాతీయ రహదారి డిఇతోను, కాంట్రాక్టర్తో రహదారి విషయంపై మాట్లాడి ప్రజా సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపుతానని ఆయన తెలిపినట్లు నరేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దు తేజ, నులకని శ్రీను, ఆరేటి ఏసుబాబు, వెంకట్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర - పాలకొల్లు : యలమంచిలి మండలం లక్ష్మిపాలెం లో శుక్రవారం, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశాల మేరకు, పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని కూటమి నాయకులు, లక్ష్మీపాలెం వరద బాధితులకు బియ్యం, కందిపప్పు, నూనె, ఉల్లిపాయలు తదితర నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల

టిడిపి అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, కడలి గోపాలరావు, చెరుకూరి అంజిబాబు, టిడిపి జనసేన బిజెపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంక్షోభంలో సంక్షేమం అందిస్తున్నాం

విశాలాంధ్ర -భీమవరం: వైసీపీ పాలనంతా అరాచకమేనని, కూటమి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశామని, విపత్తులొచ్చినా సమర్థవంతంగా ఎదుర్కొన్నామని

కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. భీమవరం 6వ వార్డు తాడిమళ్ళ లక్ష్మి నరసమాంబ పురపాలక ప్రత్యేక పాఠశాలలో “ ఇది మంచి ప్రభుత్వం” కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ అన్నదాతకు అండగా నిలబడే ప్రభుత్వం మా కూటమి ప్రభుత్వమని, వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించిందని, రైతులతోపాటు వివిధ వర్గాల ప్రజల జీవితాలతో చెలగాటం ఆడిందని, ప్రాజెక్టులను గాలికి వదిలేసాయని అన్నారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్లు రద్దు చేస్తే కూటమి ప్రభుత్వం 175 క్యాంటీన్లు ప్రారంభించి రూ.5 లకే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, భీమవరంలో మూడు చోట్ల అన్న క్యాంటీన్లు ప్రారంభించామని అన్నారు. 100 రోజుల్లో అవ్వాతాతలకు పింఛన్ రూ .4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు, కష్టాల్లో ఇంట్లో ఒకరిగా తోడు నిలిచామని అన్నారు. అనంతరం 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను విడుదల చేసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, బండి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి రాని డాక్టర్లు...
వైద్యులు లేక గర్భవతుల ఆందోళన

విశాలాంధ్ర-లింగపాలెం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులు శుక్రవారం విధులకు హాజరుకాలేదు. దీంతో వీరు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకి చేరింది. లింగపాలెం మండలంలోని లింగపాలెం,కే. గోకవరం, ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వైద్యులు రావటం లేదు. తమ డిమాండ్లు పరిష్కరించాలని వైద్యులు చేస్తున్న సమ్మె విషయం తెలిసిందే.వైద్యులు రాకపోవడం వల్ల ఈ ఆరోగ్య కేంద్రాల్లో ప్రధానంగా వైద్యం చేయించుకుంటున్న గర్భవతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అనేకమంది గర్భవతులకు కాన్పు సమయం దగ్గర పడుతుండటంతో ఆసుపత్రులలో వైద్యులు లేక ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఉన్న ఆరోగ్య కేంద్రా లలో వైద్యం చేయించుకుంటున్న గర్భవతులు ఇప్పుడు డాక్టర్లు లేకపోవడం వల్ల ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి గర్భవతి ఆరోగ్య పరిస్థితి తెలుసున్న డాక్టర్లు కాన్పు సమయంలో లేకపోవడం వల్ల మరో డాక్టర్ వద్దకు వెళితే కొత్త సమ స్యలు వస్తాయని గర్భవతులు ఆందోళన చెందుతున్నారు. వైద్యులు విధుల్లోకి వస్తే ఎటువంటి ఇబ్బంది ఉండదని గర్భవతులు అంటున్నారు.

రైతులకు మీరే న్యాయం చేయాలి

విశాలాంధ్ర- పోలవరం: గతంలో కురిసిన భారీ వర్షాలకు మునిగిపోయిన పంట నష్టం జాబితాలో అధికారులు మమ్మల్ని మోసం చేశారని, మీరే న్యాయం చేయా లంటూ శుక్రవారం పోలవరం తహసిల్దార్ కార్యాల యం వద్దకు సుమారు 50 మంది

రైతులు వెళ్లి తహసిల్దార్ సాయి రాజు కు తమ గోడును వినిపించారు. ఈ సందర్భంగా రైతులు మిరియాల అంజిబాబు, గొంతు శివ, కోడి పోసి, బదిరెడ్డి వెంకన్న, కరిబండి వెంకట్రావు, నల్ల బాబీలు తహసిల్దార్‌తో మాట్లాడుతూ వరద ముంపునకు గురైన పంట పొలాల వివరాలు విషయంలో అధికారులు తమ ఇష్టం వచ్చినట్లు వ్యవహరించారని అన్నారు. గ్రామాన్ని ఆనుకుని ఉన్న పంట పొలాలు, గొడ్లు చావడలు, లాంటివాటికి జాబితాలో పేర్లు నమోదు చేశారని, పాడైన పంట రైతుల వివరాలు మాత్రం జాబితాలో పొందుపరచలేదన్నారు. 5 ఎకరాల పంట పాడైన వారికి 50 సెంట్లు మాత్రమే నష్టపరిహారం రాశారని, వారి ఇష్టమైన వారికి పంట పాడవకపోయినా పూర్తి నష్ట పరిహారాలు రాశారని దానికి సంబంధించిన వివరాలు వారి జాబితాలోనే ఉన్నాయని వాటిని మేము కనిపెట్టామని చెప్పారు. ఈ విషయంపై అగ్రికల్చర్ అధికారిని అడగగా జాబితాలో పంటలు పాడైన రైతులు అందరి పేర్లు వస్తాయని చెప్పి ఎవరు పేర్లు పెట్టకుండా జాబితా మాత్రం రైతు సేవ కేంద్రం వద్ద పెట్టారని చెప్పారు. వీటిపై పూర్తి విచారణ చేయిస్తారని, అనర్హులు ఉంటే పేర్లు తొలగిస్తామని, అర్హులు మాత్రం జాబితాలో పొందుపరుస్తామని కలెక్టర్ తెలిపారు.

వరద బాధితులకు విద్యార్థులు
రూ.2 లక్షల50 వేల విరాళం

విశాలాంధ్ర - కాళ్ళ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఏలూరుపాడు గ్రామంలోని జ్ఞానా నంద ఇంగ్లీష్ మీడి యం స్కూల్ విద్యార్థులు రూ.2 లక్షల50 వేల

విరాళాన్ని ఉండి శాసనసభ్యులు రఘురామకృష్ణంరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి సహాయం చేయాలనే తపన చిన్నారుల్లో కలగడం మంచి పరిణామమని, సమాజంలో మార్పు కలుగుతుందన్నారు. చిన్నారులకు విద్యా బుద్ధులతో నైతిక విలువలను నేర్పడం ఆనంద దాయకం అని స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.అనంతరం రెండు వంతెనెలను, సచివాలయం ను,మార్కెట్ షెడ్లను ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ ఏర్పాటు చేసిన 250 దుప్పట్లను పేదలకు పంచారు. ఈ కార్యక్రమంలో అంజనేయ రాజు, నాగేశ్వరరావు, పెద్ద నరసింహులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ బహుజన సమైక్య సాయం
రూ.25,616 విరాళం

విశాలాంధ్ర-భీమవరం: వరద బాధితుల సహాయానికి మేమున్నామంటూ ముందు కొచ్చిన ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ బహుజన సమైక్య అధ్యక్షులు, సభ్యులను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేకంగా అభినందించారు.శుక్రవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఎస్సీ,ఎస్టీ, బిసి, మైనార్టీ బహుజన సమైక్య అధ్యక్షులు, సభ్యులు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి రూ.25వేల616 చెక్కును అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ వరద బాధితుల పట్ల ఔదార్యం ప్రకటిస్తూ జిల్లా ప్రజలు స్పందించిన తీరు ముదావహ మన్నారు. నేడు చెక్కును అందజేసిన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ బహుజన సమైక్య ఎంతో ప్రత్యేకం అన్నారు. ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు స్పందించడం, ఉన్నదానిలో ఎంతో కొంత తోచిన సహాయం చేయడం చాలా గొప్ప విషయం అన్నారు.చెక్కును అందజేసిన సందర్భంలో సమాఖ్య ఫౌండర్ అండ్ చైర్మన్ సోడదాసీ గంగయ్య,జిల్లా ఉపాధ్యక్షులు గుడిసె అనిల్ కుమార్, కోశాధికారి గుర్రం వెంకట రత్నం, నియోజకవర్గ కార్యదర్శి కొండ రాజేష్ కుమార్, ఉపాధ్యక్షులు కుతాడి నరసింహ మూర్తి, లక్కాకుల అశోక్, బందీలా జార్జ్, లింగంపల్లి మనోహర్, టీ.ప్రసన్న కుమార్, తాళ్లూరి రాజ్ కుమార్, బంటుమిల్లి జేమ్స్ తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతా-హి -సేవ

విశాలాంధ్ర - తణుకు : స్వచ్ఛతా-హి -సేవ 2024 కార్యక్రమంలో భాగంగా ఎస్ కె ఎస్ డి మహిళ కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి విభాగాల వారు మునిసిపల్ పారిశుద్ధ్య విభాగం వారు సంయుక్తంగా శుక్రవారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలు- పరిశుభ్రత దాని ప్రాముఖ్యత విద్యార్థినిలకు తెలియజేసే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు ఎల్ సుందరి భాయ్, శానిటరీ, ఎన్విరాన్మెంట్ విభాగం మున్సిపాలిటీ సిబ్బంది సుభాని, రేణుక, హామీదా, కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కెవి శ్యామలాదేవి, సిహెచ్ రమేష్ కుమార్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సిసి క్యాడెట్స్, విద్యార్థినిలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పటిష్ట కార్యాచరణ - బడేటి చంటి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : ప్రజా సంక్షేమానికి పటిష్ట కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని ఎంఎల్ఏ బడేటి చంటి పేర్కొన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా ఆయన శుక్రవారం స్థానిక 47వ డివిజన్ తిలక్ నగర్ లో పర్యటిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న ఆరు నెలల్లో సూపర్ సిక్స్ అమలు చేస్తామని చెప్పారు. అర్హులందరికీ పెన్షన్లు ఇస్తామని, గత ప్రభుత్వంలో అకారణంగా తొలగించిన పెన్షన్లు పునరుద్ధరి స్తామని అన్నారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ బండలు అందించే కార్యక్రమం చేపడుతున్నా మని తెలిపారు. ఏలూరును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, ఏలూరులో పరిశ్రమలు యేర్పాటు చేసి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ వందనాల భవానీ శ్రీనివాస్‌ను డిప్యూటీ మేయర్‌గా ఎంపిక చేస్తున్నట్లు ప్రకటిం చారు. స్థానిక కార్పొరేటర్ వందనాల భవానీ శ్రీనివాస్, మేయర్ నూర్జహాన్, పెదబాబు, ఎంఆర్డి బలరాం, బొద్దాని శ్రీనివాస్, పలువురు కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - తణుకు :ఎన్డీయే కూటమి ప్రభుత్వం పాలనకు 100 రోజులు పూర్తి అయిన సందర్భంగా తణుకు పట్టణం 3,4 వ వార్డులలో నిర్వహించిన “ ఇది మంచి ప్రభుత్వం” ప్రజా వేదికలో ముఖ్య అతిథిగా తణుకు శాసన సభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో సీఎం నారా చంద్రబాబు ,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వం లో ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో 100 రోజుల్లో జరిగిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు ఆరిమిల్లి వివరించారు. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరులో : ఉంగుటూరు గ్రామంలో శు క్రవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం లో భాగంగా ఇంటింటికి 100 రోజుల సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఉంగుటూరులో గ్రామ సర్పంచ్ బండారు సింధు మధుబాబు, పంచాయితీ కార్యదర్శి ఇంటింటికి వెళ్లి వంద రోజులో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్టిక్కర్లు ఇంటిపై అంటించారు. ఉపసర్పంచ్ పాతూరి శ్రీ జనార్దన్ , పాలక వర్గ సభ్యులు సూరత్తుల శ్రీను, తిప్పని రాంబాబు, కూటమి ప్రభుత్వ ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వి.ఎస్.వి ప్రసాద్‌కు పురస్కారం

విశాలాంధ్ర - తణుకు : తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే అంశంపై ఇటీవల అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అయిన శ్రీ శ్రీ కళావేదిక నిర్వహించిన కవితల పోటీలలో తణుకు పట్టణ కవి వి ఎస్ వి ప్రసాద్ పాల్గొని తెలుగుజాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే అంశంపై అత్యుత్తమ కవితా పురస్కారం అందుకున్నారు. ఈ పోటీలలో

సుమారు 400 మంది కవులు పాల్గొని వారి కవితలను చదివి వినిపించారు. పద్మశ్రీ ఎన్టీ రామారావు నట వైభవాన్ని గూర్చి “పునరావృతం కాని మహాయుగం “ అనే శీర్షికతో కవి ప్రసాద్ రచించిన కవితకు అత్యుత్తమ పురస్కారం లభించిం దని, కవి ప్రసాద్ కు ఇది నాల్గవ ఉత్తమ పురస్కారం అని ఇంతవరకు ఏ కవికి దక్కని అరుదైన పురస్కారం ప్రసాద్ కు దక్కిందని శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కె. రామావతి, జి. ఈశ్వరి భూషణం, చిట్టి లలిత, నల్ల భాగ్యలక్ష్మి, సంపత్, కన్వీనర్, అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే
బొలిశెట్టి శ్రీనివాస్

విశాలాంధ్ర - తాడేపల్లిగూడెం : కష్టంలో ఉన్న ప్రతి ఒక్కరికి సాయం చేయాలనే పెద్ద మనసుతో తెలుగుదేశం పార్టీకి చెందిన చందు కుటుంబ సభ్యులకు అందించిన ఆర్థిక



సహాయానికి, వారి కుటుంబానికి కలిగించిన నమ్మకానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు, జన సైనికులు, వీర మహిళలు, భారతీయ జనతా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తమ హర్షామోదాలను వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తన నియోజకవర్గానికి చెందిన పెద తాడేపల్లి గ్రామం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు అయిన పసుమర్తి చంద్ర శేఖర శ్రీనివాసరావు (చందు) అకాల మరణానికి చలించి పోయారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ వారి కుటుంబ ఆర్థిక స్థితిగతుల్ని దృష్టిలో ఉంచుకుని వారి పిల్లల యొక్క భవిష్యత్తు కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తో వ్యక్తిగతంగా మాట్లాడడమే కాకుండా తన వంతు సహాయంగా ఐదు లక్షల రూపాయలను ముఖ్య మంత్రి చేతుల మీదుగా పసుమర్తి చందు పిల్లలకు అందించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులతో పాటు చందు మేనమామ నూని సీతయ్య, బలుసు లక్ష్మణ రావు ,జనసేన పార్టీ, తెలుగుదేశం పార్టీ భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన నీరు

విశాలాంధ్ర - గణపవరం: జిల్లాలో ప్రతి గ్రామానికి జలజీవన్ మిషన్ వాటర్ ట్యాంక్ ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందిస్తామని పశ్చిమగోదావరి జిల్లా రూరల్ వాటర్ సప్లై శానిటేషన్ ఇంజనీరింగ్ అధికారి బివివి నాగేశ్వరావు అన్నారు. శుక్రవారం గణపవరం మండలం వల్లూరు గ్రామ పంచాయతీలో జల జీవన్ మిషన్ వాటర్ ట్యాంక్ పనిని పర్యవేక్షణ, జల జీవన్ మిషన్ పై అవగాహన కల్పిస్తు, స్వచ్ఛత హై సేవ లో భాగముగా కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి సోమేశ్వర రావు, గణపవరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కందుల రూపేష్, వల్లూరు సర్పంచ్ ముచ్చర్ల వేణుగోపాల్ కృష్ణ , కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి పౌష్టికాహారం : ఎంపీపీ

విశాలాంధ్ర - అంబాజీపేట : గర్భిణులు, బాలింతలు, పిల్లలకే కాకుండా పౌష్టికాహారం అందరికీ అవసరమని అంబాజీపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. కొర్లపాటి వారి పాలెం కాపు కళ్యాణ మండపంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలు జరిగాయి. పీ గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడపబడుతున్న అంగన్వాడీ కేంద్రాలలో గర్భిణి, బాలింతలకు ప్రతినెల గుడ్లు, పాలు, పప్పు, బియ్యం, నూనె, ఖర్జూరం, అటుకులు, బెల్లం, రాగిపిండి, చిక్కీలు, బాల సంజీవిని కిట్, పిల్లలకు బాలామృతం వంటివి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం పదిమంది గర్భిణులకు సీమంతం చేశారు. మాచవరం గ్రామానికి చెందిన మహిపాల తాతాజీ, పద్మావతి సమకూర్చిన పోషకాహారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ జె వెంకటేశ్వరి, హెల్త్ విజిటర్ ఎస్ఎంవి శాంతకుమారి, జడ్పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు మట్ట పార్వతి, ఆర్ఐ ఎండి ఇబ్రహీం, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు వివిఎస్ మహాలక్ష్మి, ఎన్ వెర్నెమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం సందర్శన

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండలం లోని నర్సిపూడి గ్రామంలో దూనే స్వామినాయుడు, రాయుడు సతీష్, రాయుడు బాబ్జీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సందర్శించారు. ఈ శిబిరంలో ఉచిత సేవలు అందించిన రామ డెంటల్ కేర్, ఆదర్శ హాస్పిటల్, డాక్టర్ మోహన్ డైబిటిస్ సెంటర్, గౌతమీ నేత్రాలయ తదితర ఆసుపత్రుల యాజమాన్యాన్ని, సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఉచిత మందులు, అవసరమైన చికిత్స నిమిత్తం కృషి చేసిన స్వామినాయుడు, సతీష్, బాబ్జీలను అభినందించడమే కాక భవిష్యత్తులో మరింత పెద్ద ఎత్తున ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సలాది నాగేశ్వరరావు, కందికట్ల రాంబాబు, చలపతి వెంకటరమణ, లంక వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - ఆత్రేయపురం : మండల కేంద్రం అంకంపాలెం గ్రామంలోని ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలన పైరాజవరం గ్రామ సర్పంచ్ ముత్యాబత్తుల రాజు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు మరియు సచివాలయం సిబ్బంది సహకారంతో ఇంటింటి ప్రచారంలో భాగంగా శుక్రవారం ప్రతి ఇంటికి వెళ్లి పరిపాలన నెరవేర్చిన హామీలు గురించి వివరించి కరపత్రాలు అందజేసి డోర్‌కి పోస్టర్ అంటించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముత్యాబత్తుల రాజు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా కూటమి పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమర్థవంతంగా 100 రోజుల పాలన అందించారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి అవుతున్న సందర్భంగా 20 నుంచి 26వ వరకు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్వహిస్తుంది. దానిలో భాగంగా కిర్లంపూడి మండలం జగపతినగరం సత్యదేవ కళ్యాణ మండపంలో అధికారులు, కూటమి పార్టీ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నెహ్రూ మాట్లాడుతూ చంద్రబాబు, పవన్‌లు అహర్నిశలు పరిశ్రమిస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. కష్టంలో ఉన్న ప్రతీ వ్యక్తికి ఉపయోగపడే విధంగా నిర్ణయాలు తీసుకున్నారన్నారు. మనసున్న వ్యక్తి పాలకుడైతే ఏదైనా ప్రవేశపెట్టగలడు అని నిరూపించిన వ్యక్తులు చంద్రబాబు, పవన్‌లు అన్నారు. టిడిపి హయాంలో నిర్మించుకున్న గృహాలకు గత ప్రభుత్వం బిల్లులు నిలిపివేసిన పరిస్థితులు ఉన్నాయన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అలా కాకుండా గత ప్రభుత్వంలో నిర్మించుకున్న గృహాలకు బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇది మంచి ప్రభుత్వం అనడానికి ఈ 100 రోజుల పాలన నిదర్శనం అన్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అందరికీ మంచి చేసిందన్నారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశాల్లో అధికారులకు ప్రజల సమస్యలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, జగపతినగరం సర్పంచ్ గుడాల శ్రీలత రాంబాబు, టిడిపి నాయకులు తోట గాంధీ, చదరం చంటి, జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఉలిసె ఐరాజ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో దేశాభివృద్ధి : ఎంపీ

విశాలాంధ్ర - రాజానగరం : విజ్ఞతతో కూడిన సాంకేతిక పరిజ్ఞానం,అన్వేషణ మార్గాలు వినియోగించడం ద్వారా భారతదేశ అభివృద్ధిపథంలో ముందుకు వెళ్తుందని రాజమండ్రి పార్లమెంటు సభ్యులు దగ్గుబాటి పురంధే శ్వరి అన్నారు. మండలంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నందు వర్సిటీ ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన యువజన ఉత్సవాలు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. రాబోయే ఐదేళ్లలో మూడో ఆర్థిక శక్తిగా భారతదేశం ఎదగనున్నట్లు చెప్పారు. నేడు ప్రపంచంలో ఆర్థిక శక్తిగా ఎదిగిన దేశాలు వృద్ధాప్య ఛాయలను కలిగి ఉండగా భారతదేశం ఒకటే భవిష్యత్తు అభివృద్ధికి కొలమానంగా ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశాన్ని ప్రపంచ స్థాయిలో అత్యున్నత శిఖరాల్లో ఉంచేలాగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తూర్పు గోదావరిజిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ యువతలో మంచి నాయకత్వ లక్షణాలు ఉన్నప్పుడే విజయాలు సాధ్యం అవుతాయని, సమిష్టిగా పనిచేసి విజయాలను సొంతం చేసుకోవాలి అన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ, గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించడంలో యువశక్తి కీలకమన్నారు. రాజమండ్రి లో దామెర్ల రామారావు ఆర్ట్గ్యాలరీ, రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం, నేదునూరి గంగాధర్ గ్రంథాలయం వంటి ఎన్నో దర్శనీయ స్థలాలు ఉన్నాయ నీ, వాటి గురించి యువత తెలుసుకుని,మన సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించటానికి తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల బలరామ కృష్ణ,గోరంట్ల బుచ్చయ్య చౌదరి,యువజన సర్వీసుల శాఖ కమిషనర్, ఎండి, ఏపీఎస్ఎస్డీసి ఈపి కె.శారదా దేవి, కాకినాడ సీఈవో, సెట్ రాజ్ కె ఎస్ వి. కాశీ విశ్వేశ్వర రావు, నన్నయ విశ్వవిద్యాలయం అధికారులు,ప్రజా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల న్యాయం : దాట్ల

విశాలాంధ్ర - తాళ్ళరేవు : తాళ్ళరేవు మండలం, జార్జిపేట పంచాయితీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు అవిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటి ఇంటికి తీసుకుని వెళ్ళి కరపత్రాలు ముమ్మిడివరం నియోజకవర్గం శాసనసభ్యుడు దాట్ల సుబ్బరాజు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గత 5 సంవత్సరాలు పరిపాలనలో రాష్ట్రం పది లక్షల కోట్లు అప్పులపాలు చేశారని, కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం ఫించన్ నాలుగు వేల రూపాయలు పెంచి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని, ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేశారని, విజయవాడ వరదలలో చిక్కుకున్న అనేక మందిని 10 రోజులు పాటు ఆదుకున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు, పవన్ కళ్యాణ్ సారథ్యంలో నిర్వహించిన గ్రామ సభలకు గుర్తింపు వచ్చింది అన్నారు. రూ.30 లక్షలతో జార్జిపేట కోలనీలో సిమెంటు రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ (బాబి), సర్పంచ్ గుత్తుల సత్యవేణి సూరిబాబు, యంపిపి రాయుడు సునీత, పొన్నమండ రామలక్ష్మి, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, అత్తిలి బాబూరావు, దత్తాత్రేయ, త్రిమూర్తులు, పిల్లి సతిబాబు, యంపిటిసి సూరిబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కూసపరెడ్డి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత హి సేవా పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కరప : కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల గోడ పత్రికను శుక్రవారం ఆవిష్కరించడం జరిగిందని, యంగ్ మైండ్ స్వచ్ఛంద సేవ అధ్యక్షులు వాకాడ వెంకటరమణ తెలిపారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు కాకినాడ రూరల్ మండలాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వచ్ఛంద సేవ సంస్థలు పాల్గొని స్కూళ్లలో, గ్రామాల లోనూ, బహిరంగ ప్రదేశాలలో పారిశుద్ధ్య పనులు చేపట్టి పచ్చదనం కోసం మొక్కలు నాటించుట వంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్వి సీఎంవో చామంతి నాగేశ్వరరావు రాజబాబు, కామేశ్వరరావు, నందిపాటి ఆదినారాయణ, కామేశ్వరరావు, కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల సరిహద్దులను గుర్తించేందుకు తనిఖీలు

విశాలాంధ్ర - కాకినాడ : జిల్లాలో అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల సరిహద్దులను గుర్తించేందుకు రెవెన్యూ, అటవీ, సర్వే అధికారులు ఉమ్మడి తనిఖీ చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధ్యక్షతన జిల్లా అటవీ సంరక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారిని ఎస్ భరణి, అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని అటవీ సరిహద్దులు గుర్తించేందుకు సర్వే నిర్వహించడం, చెక్ పోస్టులు వద్ద తనిఖీలు, అక్రమ అటవీ జంతువుల రవాణా అరికట్టడం, మడ అడవుల్లో నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణా నివారణ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జే సీతారామరావు, సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి అనూష, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి ఏ చంద్ర మౌళేశ్వరి, సర్వే, ల్యాండ్ రికార్డ్స్ ఏడి బి లక్ష్మీనారాయణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇది మంచి ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సీతానగరం: ఇది మంచి ప్రభుత్వం అంటూ ప్రజలోకి కూటమి ప్రభుత్వం. మండలంలో ఇనుగంటివారిపేట, రామచంద్రపురం గ్రామాల్లో శుక్రవారం రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో సీతానగరం గ్రామంలో స్వచ్ఛత భారత్ హై సేవలో భాగంగా బత్తుల, బొడ్డు మొక్కలను నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని గ్రామ ప్రజల సమక్షంలో నిర్వహించి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులలో చేసిన మంచి కార్యక్రమాలన్నీ ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్, తహసిల్దార్ శ్రీనివాస్, ఏ పి ఓ నాగ శేష వేణి, నా సేన నా వంతు కొఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, మొదలగు కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు.

క్లీన్ వాటర్ బాడీస్‌పై స్వచ్ఛతా హీ సేవ

విశాలాంధ్ర - సామర్లకోట : స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సామర్లకోట రైల్వే స్టేషన్‌లో 'క్లీన్ వాటర్ బాడీస్' ఎజెండాతో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో రైల్వే అధికారులు, సిబ్బంది స్వచ్ఛతా ప్రతిజ్ఞ నిర్వహించారు. సిబ్బందిచే పరిసర స్టేషన్‌ను, నీటి వనరులను శుభ్రపరిచిచారు. స్టేషన్ ప్రాంగణంలోని అన్ని కుళాయిలు, వాటర్ కూలర్‌లను తనిఖీ చేసి పరిశుభ్రత, పనీతీరు పోషణను నిర్ధారించారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర - అంబాజీపేట : అప్పుల బాధ తాళలేక ముక్కామలలో చెల్లు వెంకన్న(56) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి అంబాజీపేట ఎస్సై కె చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం ముక్కామల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెనుక ఉన్న చెల్లు వెంకన్న (56) తన ఇంటి సమీపంలో ఉన్న తాటాకు పాకలో ఉరి వేసుకుని మృతి చెందాడు. స్థానికంగా పెద్దగా కూలి పనులు లేకపోవడంతో రెండు వారాల క్రితం హైదరాబాద్‌లో నివాసముంటున్న తన కుమార్తెల ఇంటికి వెళ్లాడు. అనంతరం వారం కిత్రమే తిరిగి ఇంటికి వచ్చాడన్నారు. అప్పులు బాధలు ఎక్కువ కావడంతో తన సమీప బంధువునకు తన వద్ద ఉన్న కొంత పొలాన్ని రూ.7.01లక్షలకు విక్రయించాడన్నారు. అందుకు అడ్వాన్సుగా రూ.1.50లక్షలు నగదును వెంకన్న తీసుకున్నాడన్నారు. ఈ నెల 19 రాత్రి ఇంటి బయట పడుకుంటానని అతని భార్య నాగమణికి చెప్పాడన్నారు. ఉదయం చూసే సరికి వెంకన్న పాకలో ఉరి వేసుకున్నాడని కుటుంబ సభ్యులకు స్థానికులు తెలిపారన్నారు. మృతుని అన్న కుమారుడు చెల్లు వెంకట దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల మన్ననలతో ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రావులపాలెం : ప్రభుత్వం ఏర్పడ్డ వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందిన ప్రభుత్వం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేసినా, రాష్ట్రం ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా పాలన సాగించిందని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ ఒకేసారి వెయ్యి పెంచి నాలుగు వేలు చేయడమే కాకుండా హామీ ఇచ్చిన మేరకు మూడు వేలతో కలసి ఏడు వేల రూపాయలను మొదటి నెల ఒకటో తేదీన ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇంచార్జి బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, కేవి సత్యనారాయణ రెడ్డి, గుత్తుల రాంబాబు, చిలువూరి సతీష్ రాజు, సబ్బితి మోహన్ రావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముత్యాల బాబ్జి, పాలూరి సత్యానందం, తోట స్వామి, అధికారి నాగేశ్వరరావు, మైగపుల గురవయ్య, కాస సాగర్ పాల్గొన్నారు.

ప్రజారంజక పాలన : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెదపూడి, అనపర్తి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజా పాలన సాగిస్తుందని గత వైసిపి ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను అస్తవ్యస్తం చేయగా కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే ప్రజల మన్ననలు పొందడం జరిగిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం దోమాడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పెంచిన పెన్షన్లు మొదటి తారీఖునే ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ల్యాండ్ టైటిలింగ్ రద్దు చేయడం జరిగిందని,దీపావళి నుండి ఉచిత గ్యాస్ పంపిణీ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నల్లమిల్లి చెప్పారు. రామవరం- రాయవరం రోడ్డు అభివృద్ధికి కోటన్నర, సీసీ రోడ్ల నిర్మాణం కోసంరూ.14 కోట్లు, అనపర్తి కెనాల్ రోడ్డు మరమ్మత్తుల నిమిత్తం రూ.6.33 కోట్లు, రంగంపేట- ముకుందవరం రోడ్డు, రంగంపేట-సింగంపల్లి రోడ్డుకు రూ.7.50 కోట్లు నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు. దాదాపు రూ.10 కోట్లతో వేడి దేవాలయాలు అభివృద్ధి చేయడానికి ప్రతిపాదన పంపడం జరిగిందని నల్లమిల్లి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

విశాలాంధ్ర - కాకినాడ : కేసీబీఎస్ పురోవృద్ధికి కారణమైన ప్రతి ఒక్క ఖాతాదారునికి మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని ది కాకినాడ కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. స్థానిక రామయ్య వీధిలోని కెసిబిఎస్ కార్యాలయ ఆవరణలో సంస్థ సభ్యుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ట్రస్ట్ హాస్పిటల్ సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్డియాలజీ, నెఫ్రాలజీ, జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ సమస్యలకు సంబంధించి వైద్యనిపుణులు హాజరై వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా కేసిబిఎస్ చైర్మన్ కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఖాతాదారుల తోడ్పాటుతో శత వసంతాలు పూర్తి చేసుకున్న కేసిబిఎస్ మరిన్ని మెరుగైన సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. కేసిబిఎస్ ఉపాధ్యక్షుడు రెడ్డి వీర రాజేంద్రకుమార్ మాట్లాడుతూ సంస్థ పురోభివృద్ధి కోసం ప్రతి ఉద్యోగి మరింత కష్టించి పనిచేయాలని సూచించారు. చైర్మన్ కోసూరితో పాటు పాలకవర్గ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కేసిబిఎస్ మాజీ అధ్యక్షులు కోసూరి కృష్ణారావు, కోసూరి యదుసూర్య చిత్రపటాలకు తొలుత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కెసిబిఎస్ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీప్రసాద లావణ్య, ముమ్మిడి వెంకటరమణ, ముత్తా మధు, మేనేజర్ చీమలకొండ గంగాధరం ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

సర్జికల్ కిట్లు, బెడ్ షీట్లు పంపిణీ

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం జనసేన ఆధ్వర్యంలో కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురం ప్రాథమిక హాస్పిటల్లో సర్జికల్ కిట్లు, బెడ్ షీట్లు పంపిణీ చేశారు. కపిలేశ్వరపురం మండలం కపిలేశ్వరపురంలో ప్రాథమిక హాస్పిటల్‌కు వారి యొక్క మెరుగైన సేవలను గుర్తించి అంగర గ్రామానికి చెందిన జనసేన పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు తోరాటి శ్రీనివాస్ ఆర్థిక సౌజన్యంతో హాస్పిటకు ఉపయోగపడే సర్జికల్ కిట్లను, బెడ్షీట్లను, మాస్కులు ఇవ్వడం జరిగింది. ఈ కిట్లను కపిలేశ్వరపురం ప్రాథమిక హాస్పిటల్ సూపరింటెండ్‌కు ఈ కిట్లు అందజేశారు. కపిలేశ్వరపురం సూపరింటెండ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా హాస్పిటల్‌కు ఈ సహాయం అందించినందుకు జనసేన నాయకులకు ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు. అదేవిధంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కపిలేశ్వరపురం ప్రాథమిక హాస్పిటల్లో మెరుగైన వైద్యం ప్రజలకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పిల్లా బసవరాజు, దానేటి శరత్, ఆలపాటి నారాయణ, మూర్తి, సుధా, తేజ పాల్గొన్నారు.

వసతుల కల్పనపై దృష్టి : కలెక్టర్

విశాలాంధ్ర -రాజమహేంద్రవరం రూరల్ : సంక్షేమ వసతి గృహాలలో 'సిఎస్ఆర్' కింద వసతుల కల్పనపై దృష్టి కేంద్రీకరించనున్నట్లు, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు అంచనాలు అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో సంక్షేమ, పరిశ్రమల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సి ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల ప్రస్తుత పరిస్థితి, చేపట్టవలసిన పనులు, అందుకు అనుగుణంగా సిద్ధం చేసిన ప్రతిపాదనలు పై వసతి గృహాల వారీగా సమీక్షించడం జరిగింది. నివాస యోగ్యంగా లేని, శిథిలావస్థ స్థితిలో ఉన్న వసతి గృహాలను వేరొక చోటకు మార్పు చేయ్యాలన్నారు. మరమ్మత్తులు, మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం వసతి గృహాల వారీగా పనుల పై సమీక్షించడం జరిగిందన్నారు. గిరిజన

సంక్షేమ శాఖ ఆశికాల ఆవరణలోని బాయ్స్ గర్ల్స్ హాస్టల్ గోకవరం బాయ్స్ హాస్టల్ పరిధిలో చేపట్టవలసిన పనులను అధికారులు తెలియ చేశారు. జిల్లా ప్రణాళిక అధికారి, జిల్లా పరిశ్రమల, పరిశ్రమల తనిఖీ అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి, సమగ్ర వివరాలు అందచేయాలని ఆదేశించారు ఈ సమావేశంలో జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్ . అప్పలకొండ, పరిశ్రమంలో సహాయ సంచాలకులు పి. ప్రదీప్ కుమార్, జిల్లా ఫ్యాక్టరీస్ తనిఖీ అధికారి జి. స్వాతి, సంక్షేమ అధికారులు కే ఎస్ జ్యోతి, ఎమ్ సందీప్, బి. శశాంకలు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు పాలనపై ప్రజలు సంతృప్తి

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా తెలుగు దేశం, జనసేన, బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లి గ్రామంలో సర్పంచ్ ఆచంట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు 100 రోజుల పాలనలో ప్రజలు ఎంతో సంతృప్తి చెంది మంచి ప్రభుత్వంగా మన్ననలు పొందింది అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు కామేశ్వరరావు, కే.శంకర మూర్తి, వార్డు సభ్యులు వెలుగుబంటి యేసు దాసు, సచివాలయం సిబ్బంది, ఎన్‌డిఏ కూటమి శ్రేణులు కొండిసెట్టి నాగేశ్వర రావు, వెలుగుబాంటి వీర భద్ర పాల్గొన్నారు.

జగన్‌తోనే ఈ అరిష్టం : ఎమ్మెల్యే జ్యోతుల

విశాలాంధ్ర - జగ్గంపేట : హిందువులు ఆరాధ్య దైవంగా భావించే తిరుమలలో ఆనాడు జగన్ చేసిన పనుల వల్లే రాష్ట్రంలో ఈ అరిష్టాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయం వద్ద విలేకర్ల సమావేశంలో నెహ్రూ మాట్లాడుతూ కూటమి ప్రజా ప్రభుత్వం ఏర్పడి 100 రోజులైన సందర్భంలో వారం రోజులు పాటు గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డికి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామి వెలసిన తిరుమల తిరుపతి దేవస్థానం పవిత్రతను కాపాడలేని మూర్ఖుడన్నారు. హిందువులు ఏ కార్యక్రమం చేసిన భార్యాభర్తల కలిసి చేయటం జరుగుతుందని కానీ తిరుమల బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్ ఒక్కరే పట్టుబట్టలు సమర్పించే వారిని అక్కడే సగం

పవిత్రతను దెబ్బతీశారన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ పదవిని నాస్తికులకు ఇచ్చి తిరుమల దేవస్థానం భక్తుల మనోభావాలను దెబ్బ తీయడం జరిగిందన్నారు. తిరుమల లడ్డు ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వును కలిపి ప్రసాదం తయారు చేస్తున్నారని చంద్రబాబు అన్ని రిపోర్టులు తెచ్చుకుని అపవిత్రతకు గురైందని తెలియజేయడం జరిగిందన్నారు. దీనిపై కూడా వైసీపీ కోర్టుకెళ్లడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో ఇర్రిపాక గ్రామ టిడిపి అధ్యక్షులు జ్యోతుల నాగబాబు, కొత్తూరు గ్రామ టిడిపి అధ్యక్షులు చింతల కన్నారావు, పోసి బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర - కొత్తపేట : గ్రామాల్లో స్వచ్ఛత పాటిస్తేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. వాడపాలెం గ్రామ పంచాయితీ పరిధిలో జరిగిన స్వచ్ఛత హే సేవా కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు పాల్గొన్నారు. గ్రామంలో చేస్తున్న పారిశుధ్య పనులలో జనసేన ఇంచార్జ్ బండారు శ్రీనివాస్‌తో కలసి సత్యానందరావు పారిశుధ్య పనులు చేశారు. ఈ కార్యక్రమంలో త్సామ బాబు, బండారు బుల్లితాత, పప్పుల కొత్తయ్య, బండారు వీరబాబు, బండారు అబ్బులు, చిక్కట్ల అబ్బు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పాపారావు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆలమూరు : మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమ్మ సంఘం డైరెక్టర్, కొత్తపేట నియోజకవర్గ కమ్మ సంఘం గౌరవ అధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వంటిపల్లి పాపారావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఆయన అభిమానులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన నివాసం వద్దకు రైస్ మిల్లర్స్, అభిమానులు, కూటమి నాయకులు చేరుకుని భారీ కేకులు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకృష్ణ రైస్ మిల్ స్టాఫ్, అభిమానులు గజమాలతో ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అభిమానులు, కార్మికులు రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యువత క్రీడాల్లో రాణించాలి

విశాలాంధ్ర - సామర్లకోట : శుక్రవారం స్థానిక సామర్లకోట బ్రౌన్‌పేట సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో సామర్లకోట మండల స్థాయి నియోజకవర్గ స్థాయి స్కూల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాలు వయసు గల బాలుర ఎంపిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కాకినాడ జనసేన ఇన్చార్జ్ తుమ్మల రామస్వామి బాబు క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి క్రీడల్లో రాణిస్తే యువతకి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కోర్డినేటర్ విత్తనాల వేంకట రమణ, సామర్లకోట ఎంఇఒలు, సామర్లకోట మండల ఎంపీపీ బొబ్బరద సత్తిబాబు, సామర్లకోట మున్సిపల్ చైర్పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి, సామర్లకోట తెలుగుదేశం పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి, కార్యదర్శి బడుగు శ్రీకాంత్, కౌన్సిలర్ బలుసు వాసు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్, మాజీ భీమేశ్వర ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కంటే జగదీష్ మోహన్, యూత్ ప్రెసిడెంట్ వల్లూరి దొరబాబు, గోలి దొరబాబు, కోటిపల్లి శ్రీనివాసరావు, స్థానిక కౌన్సిలర్ పాలిక కుసుమ, సామర్లకోట పట్టణ జనసేన అధ్యక్షులు సరోజ వాసు, పిట్ట జానకిరామయ్య, విద్యార్థులు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత దంత వైద్య శిబిరం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో దంత శస్త్ర చికిత్సలు నిర్వహించడం జరుగుతుందని ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ టి ప్రణీత్ తెలిపారు. కాకినాడ గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో తప్ప జిల్లాలో మరెక్కడా జరగని డెంటల్ ఓరల్ సర్జరీలు ఒక్క జగ్గంపేటలోనే జరుగుతున్నా యన్నారు. శుక్రవారం రెండు ఆపరేషన్లు చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ తుని మండలం తుని పట్టణానికి చెందిన ఎన్ నూకరాజు అనే వ్యక్తికి దవడ ఎముక విరిగిపోవడంతో శుక్రవారం అతనికి దంత వైద్యులు ఎస్ శంకర్రావు ఆపరేషన్ చేయడం జరిగిందన్నారు. కత్తిపూడి మండలం కత్తిపూడి గ్రామానికి చెందిన పి యెర్రయ్య అనే వ్యక్తికి యాక్సిడెంట్ అయ్యి గెడ్డం ఎముక విరిగిపోవడంతో ఆ ఎముక అతుక్కోవడానికి ప్లేట్ వేసి సర్జరీ చేయడం జరిగిందన్నారు. ఈ రెండు సర్జరీలు కూడా విజయ వంతంగా పూర్తి అయ్యాయని, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువ ఖర్చుతో కూడుకున్న ఆపరేషన్లు ఇక్కడ చేయడం జరుగుతుందని, ప్రజలు గమనించాలన్నారు.

సొసైటీ అధికారుల తప్పిదాలు.. రైతుల పాలిట శాపాలు

విశాలాంధ్ర - రాజానగరం : కొంతమంది సొసైటీ అధికారులు చేసిన తప్పిదాలు ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలోని సందరాడ కోపరేటివ్ సొసైటీ పరిధిలో నరేంద్రపురం,సందరాడ, సీతారాంపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు తీసుకున్న సొసైటీ రుణాలకు సంబంధించి బీజేపీ నాయకులు, రైతులు కలిసి రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం బీజేపీ నాయకులు అడబాల గణపతి రావు విశాలాంధ్రతో చారవాణిలో మాట్లాడుతూ నరేంద్రపురం, సందరాడ, సీతారాంపురం గ్రామానికి చెందిన సుమారు వంద మంది రైతులు సందరాడ సొసైటీలో వివిధ రుణాలు తీసుకున్నట్లు చెప్పారు. వాటికి సంబంధించి గత మార్చి నెలలో అప్పటి వరకు ఉన్న సొసైటీ నిబంధనల ప్రకారం 7 శాతము వడ్డీలు చెల్లించి, రుణాలు రెన్యువల్ చెయ్యాలని సొసైటీ అధికారులకి విన్నవించినట్లు చెప్పారు. అందుకు సంబంధించిన రసీదులు తీసుకొన్నట్లు చెప్పారు. అయితే ప్రస్తుతం సొసైటీ అధికారులు రైతులకు ఫోన్లు చేసి లోన్లు రెన్యువల్ చెయ్యలేదని వెంటనే వడ్డీ 13 శాతం కట్టాలని చెప్పారన్నారు. దీంతో రైతులు చెయ్యని తప్పుకు అదనంగా ఏడు నుంచి ఎనిమిది వేలు రూపాయల అదనపు భారం పడుతుందన్నారు. పూర్తి సమాచారం తెలుసుకునేందుకు సొసైటీకి రైతులు వెళ్తే తమకు అవన్నీ తెలియదని వెంటనే పదుముడు శాతం వడ్డీ చెల్లించాలని సొసైటీ అధికారులు రైతులపై మండిపడ్డ రని ఆరోపించారు. తమకు న్యాయం చేయ్యాలని కోరుతూ ఎంపి పురందేశ్వరికి వినతి పత్రాన్ని అందించినట్లు చెప్పారు.దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారని, సొసైటీ జిల్లా ఉన్నత అధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపి నీ కలిసిన వారిలో ఎన్డీఏ కూటమి నాయకులు,రైతులు నూనె వెంకన్న,అడబాల ఆది విష్ణు, తాటికొండ రాంబాబు, కూరాకుల ధర్మరాజు,పల్లపు చక్ర రావు, అడబాల పాండవులు,బత్తిన బాలాజీ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత : కలెక్టర్

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : సంక్షేమ వసతి గృహాల్లో "సి ఎస్ ఆర్" కింద వసతుల కల్పన పై దృష్టి కేంద్రీకరించనున్నట్లు, అందుకు అనుగుణంగా ప్రతిపాదనలు అంచనాలు అందచేయాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరు క్యాంపు కార్యాలయంలో సంక్షేమ, పరిశ్రమల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సి ఎస్టీ బీసీ సంక్షేమ వసతి గృహాల ప్రస్తుత పరిస్థితి, చేపట్టవలసిన పనులు, అందుకు అనుగుణంగా సిద్ధం చేసిన ప్రతిపాదనలు పై వసతి గృహాల వారీగా సమీక్షించడం జరిగింది. నివాస యోగ్యంగా లేని, శిథిలావస్థ స్థితిలో ఉన్న వసతి గృహాలను వేరొక చోటకు మార్పు చేయ్యాలన్నారు. మరమ్మత్తులు, మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం వసతి గృహాల వారీగా పనుల పై సమీక్షించడం జరిగిందన్నారు. జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఎల్. అప్పలకొండ, పరిశ్రమలో సహాయ సంచాలకులు పి.. ప్రదీప్ కుమార్, జిల్లా ఫ్యాక్టరీస్ తనిఖీ అధికారి జి. స్వాతి, సంక్షేమ అధికారులు కే ఎస్ జ్యోతి, ఎమ్ సందీప్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకం కింద జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి సంబంధించి జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లోని మౌలిక సదుపాయాల ఏర్పాటుపై జిల్లా పాఠశాల విద్య, ఏపీఈడబ్ల్యుఐడీసీ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, పబ్లిక్ హెల్త్, విద్యుత్ తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక

పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలో అన్ని అంశాల్లో విద్యార్థులను సంపూర్ణమైన విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంతో పాటు పాఠశాలలకు అధునాతనం మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఈ పథకం కింద 31 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక అయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల్లో పరిశోధనపై ఆసక్తిని పెంపొందించేందుకు కెమిస్ట్రీ లాబరేటరీ ఏర్పాటు, క్రీడల వైపు మక్కువ కలిగించేందుకు క్రీడామైదానాల అభివృద్ధికి ఈ 31 పాఠశాలలకు రూ.20 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులు పాఠశాలలను సందర్శించి నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా విద్యాధికారి పీ రమేష్, ఏపీఈడబ్ల్యుఐడీసీ ఈఈ వెంకట రమణరాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి శ్రీనివాస కుమార్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ హుస్సేన్, ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్ ఉదయ్ భాస్కర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ హయాంలో గ్రామాభివృద్ధి నిర్వీర్యం

విశాలాంధ్ర -కొవ్వూరు : గత ప్రభుత్వం హయాంలో గ్రామాభివృద్ధి నిర్వీర్యమైపోయిందని, నూతన ప్రభుత్వం ఏర్పాటై 100 రోజుల వ్యవధిలో గ్రామాల అభివృద్ధికి తీసుకొచ్చిన మార్పులు గణనీయమైనవని కొవ్వూరు మండల పరిషత్ అధ్యక్షులు కాకర్ల నారాయణ మండల పరిషత్ సాధారణ సమావేశం శుక్రవారం కొవ్వూరు పట్టణంలోని శ్రీనివాసపురం మండల పరిషత్ కార్యాలయం నందు జరిగింది. మండల

పరిషత్ అధ్యక్షులు కాకర్ల నారాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండలంలోని ఆయా శాఖల ప్రభుత్వ అధికారులు గ్రామాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ఎంపీపీ కాకర్ల నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం 15 ఫైనాన్స్ నిధులను వాడుకుని గ్రామ పంచాయతీలకు మొండి చెయ్యి చూపించిందని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వం ఏర్పాటు 100 రోజుల కాలంలో పంచాయతీలలో వివిధ మార్పులను తీసుకొచ్చి 15 ఫైనాన్స్ నిధులను ఆయా గ్రామ సర్పంచులు గ్రామాల అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం కల్పించారన్నారు. జడ్పిటిసి బొంత వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వీరమల్లు నారాయణ, సెకండ్ వైస్ ఎంపీపీ నూతంగి రేఖ, ఎంపీడీవో కే సుశీల, గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు

23న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : 'వికాస' ఆధ్వర్యంలో ఈనెల 23న సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టర్, కాకినాడలో 'జాబ్‌మేళా' నిర్వహిస్తున్నారు. ఈ జాబ్‌మేళాలో ఐ & వి బయో ఇండియా ప్రై.లి.లో ఎలక్ట్రిషియన్, క్వాలిటీ అడ్వయిజర్, పెయింటర్ & డెంటల్, కోజెంట్ ఇ సర్వీసెస్‌లో బిపిఒ(ఇంగ్లీషు/తెలుగు), ఐసాన్ ఎక్స్‌పీరియన్సెస్‌లో టెలిసేల్స్ రిప్రెజెంటేటివ్, డిఎస్‌సి & ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిటెక్, & బిఎస్‌సి, మైక్రోబయోలాజీ, బిఫ్ఎస్‌సి ఆక్వాకల్చర్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్ధులు అర్హులు. 23వ తేదీ సోమవారం 'వికాస' కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ' వద్ద ఉదయం 9 గ.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరు కావలెను. వివరాలకు 7799376111, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. వికాసజాబ్స్.కాం సంప్రదించవలెను.

డీఐజీ పోలీస్ స్టేషన్‌ను సందర్శన

విశాలాంధ్ర - కొత్తపేట : సామాజిక తనిఖీల్లో భాగంగా కొత్తపేట పోలీస్ స్టేషన్‌ను డిఐజి జివివి అశోక్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూడాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పి బి కృష్ణారావు, రావులపాలెం టౌన్ సిఐ జేమ్స్, రత్న ప్రసాద్, కొత్తపేట ఎస్సై డి సురేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

'ఇది మంచి ప్రభుత్వం '

విశాలాంధ్ర - కాకినాడ : కాకినాడ రూరల్ మండలం నేమాం గ్రామంలో నిర్వహించిన "ఇది మంచి ప్రభుత్వం" అనే పేరుతో 100 రోజుల పరిపాలనలో రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి ప్రత్యేకంగా ప్రజలకు వివరించే కార్యక్రమాలలో భాగంగా నిర్వహించిన ప్రజా వేదిక 'సంక్షోభంలోను సంక్షేమం' కార్యక్రమంలో కాకినాడ రూరల్ నియోజకవర్గ శాసన సభ్యులు పంతం నానాజీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ ఎన్డీఏ రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల పరిపాలనలో తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన ప్రగతి గురించి ప్రజలకు వివరించారు, భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర సుభిక్షంగా, సస్యశ్యామలంగా పరిపాలించబడుతుందని హర్షం వ్యక్తం చేశారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఈ 100 రోజుల్లో కూటమి నాయకులతో కలిసి వారి సొంత నిధులతో సుమారు రూ.18 లక్షల ఖర్చుతో నియోజకవర్గం పరిధిలో గల కాలువలలో గుర్రపు డెక్క పూడిక తీత పనులు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టిడిపి కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు, కో-కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, నూరుకుర్తి వేంకటేశ్వర రావు, వాసిరెడ్డి యేసు దాసు, చప్పిడి వేంకటేశ్వర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, బీజేపీ నాయకులు రాంబాల వేంకటేశ్వర రావు, జనసేన పార్టీ నేమాం గ్రామ పార్టీ అధ్యక్షులు దాసరి శివ తదితరులు పాల్గొన్నారు

మండల స్థాయి క్రీడాకారులు ఎంపిక

విశాలాంధ్ర - కరప : ఎస్‌జిఎఫ్ మండల స్థాయి ఎంపికలు కరప మండల స్కూల్ గేమ్స్ బాల బాలికలకు వాలీబాల్ మరియు కబడ్డీ అండర్-14, అండర్-17 ఎంపికలు 21-9-2024 శనివారం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల గొర్రిపూడిలో జరుగుతాయని మండల కో-ఆర్డినేటర్ మరియు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కరప వ్యాయామ ఉపాధ్యాయులు కే శ్రీనివాసరావు తెలిపారు. ఎంపికలను జడ్పిపి ఉన్నత పాఠశాల, గొర్రిపూడి ప్రధానోపాధ్యాయులు అడబాల కాశి విశ్వనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు సువర్ణ లాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తారని తెలియ జేశారు. ఆసక్తి ఉన్న మండలంలోని పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు మండల స్థాయి ఎంపికలకు హాజరుకావచ్చని తెలిపారు.

ఏఐటీయుసీలోకి చేరికలు

విశాలాంధ్ర-చింతలపూడి: ఏఐటీయూసీ పోరాటాలు, సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషి పట్ల ఆకర్షితులై సిఐటియు నుండి ఏఐటీయూసీ లోకి ఎల్. సాయి లక్ష్మి,టీ. అరుణకుమారి, కె.మరియమ్మ, సిహెచ్ వెంకటలక్ష్మి, డి.రూస్నీ, జే పద్మజ, పి నాగమణి, పి పార్వతి, ఎం భారతి, ఎస్.కె రజియా,వి. పార్వతి,బి. చిన్న లక్ష్మి, వి లక్ష్మి, లతో కలిపి మొత్తం 16 మంది అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేరారు. శుక్రవారం స్థానిక సిపిఐ పట్టణ కార్యాలయంలో అంగన్వాడి వర్కర్స్, అండ్ హెల్పర్స్ అసోసియేషన్ చింతలపూడి ప్రాజెక్ట్ నాయకురాలు ఆర్.మరియమ్మ, పి. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిఐటియు నుండి ఏఐటీయూసీలోకి చేరిన 16 మందికి ఏఐటీయూసీ జండా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గంధం అంజమ్మ మాట్లాడుతూ యాప్స్ ఒకే యాప్ కిందకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీ వర్కర్లకు అనేక రకాల యాప్స్‌తో ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పనిచేయక అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్ని రకాల యాప్స్‌ని ఒకే యాప్ కిందకు తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. సమ్మె కాలంలో అంగన్వాడీలకి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్నిటిని అమలు చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యల పరిష్కారమయ్యే వరకు ఏఐటీయుసి మీకు ఉండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తొర్లపాటి బాబు, కార్మిక సంఘ నాయకులు కంచర్ల గురవయ్య పుల్లూరి సోమశేఖర్, దొంత కృష్ణ పాల్గొన్నారు.

కంటైనర్ బోల్తా...
పలువురికి గాయాలు

విశాలాంధ్ర - ఉంగుటూరు : జాతీయ రహదారి ఉంగుటూరు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చేపల లోడు కంటైనర్‌కు అడ్డుగా వచ్చిన ట్రక్కు వ్యాన్ బోల్తా పడింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉంగుటూరు ఐస్ ఫ్యాక్టరీకి చెందిన కంటైనర్ చేపల లోడు వేసుకుని తిరిగి వస్తుండగా ఉంగుటూరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. చేపల లోడు కంటైనర్‌కు ముందుగా మరో ట్రక్కు వ్యాను వెళుతున్నది. ఆ వ్యాన్ ఒక్కసారిగా వెనుక వస్తున్న చేపల లోడు కంటైనర్‌కు అదుపుతప్పి అడ్డుగా రావడంతో ఈ రెండు వాహనాలు జాతీయ రహదారిపై బోల్తా పడింది. చేపల లోడు కంటైనర్ డ్రైవర్‌తో సహా మొత్తం తొమ్మిది మంది గాయపడ్డారు. సంఘటన జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు, ప్రజా ప్రతినిధులు సంఘటన ప్రదేశానికి వచ్చారు. గాయపడిన వారిని బయటకు తీశారు. ఉంగుటూరు హైవే అంబులెన్స్‌లో గాయపడిన వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చేపలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. దీంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. నిడమర్రు సిఐ సుభాష్, చేబ్రోలు ఎస్సై సూర్య భగవాన్, రోడ్ సేఫ్టీ మొబైల్ న సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ని క్రమబద్ధీకరించారు. ప్రమాదం నుంచి కారణమైన ట్రక్కు వ్యాన్ డ్రైవర్ పరవారయ్యారు. చేపల్లోడులో గాయపడిన వారు నాచుగుంట పంచాయతీకి చెందిన వారిని తెలిసింది.

రాజనీతిజ్ఞుడు ఏచూరి : దేగా

విశాలాంధ్ర - అమలాపురం : దివంగత మహా నేత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రాజనీతిజ్ఞుడు అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దేగా ప్రభాకర్ కొనియాడారు. అమలాపురంలో సీపీఎం జాతీయ కార్యదర్శి దివంగత సీతారాం ఏచూరి సంస్మరణ సభను నిర్వహించిన కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు అధ్యక్షత వహించగా దేగా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సీతారామ్ ఏచూరి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికోసం నిరంతరం కృషి చేసిన మహా యోధుడని కొనియాడారు. దేశంలో కార్మికుల సంక్షేమానికి ఎన్నో చారిత్రాత్మక ఉద్యమాలు నడిపి చరిత్ర కారుడిగా నిలిచిపోయారని దేగా ప్రభాకర్ అన్నారు. నీతి, నైతిక విలువలకు సీతారామ్ ఏచూరి పెద్దపీట వేశారన్నారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు మాట్లాడుతూ ఏచూరి మరణంతో కార్మిక లోకం ఒక మహా ఉద్యమ నేతను కోల్పోయిందనారు. ప్రతి ఒక్కరూ ఏచూరిని ఆదర్శంగా తీసుకుని భావితరాలను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో పలువురు సీపీఐ నాయకులు, కార్మిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'దేవి' ప్రాసెస్సింగ్ యూనిట్ ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : గ్రామీణ ప్రాంతాలలో ఉపాధికల్పన దిశగా తాము చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందించడం వల్లే సత్ఫలితాలను సాధించగలుగుతున్నామని దేవి ఫిషరీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజు అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం సీతానగరం గ్రామములో నూతనంగా నిర్మించబడిన రొయ్యల ప్రోసెసింగ్ యూనిట్‌ను గురువారం ఢిల్లీలో జరుగుతున్న వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 కార్యక్రమంలో కేంద్రమంత్రులు ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖమంత్రి చిరాగ్ పాశ్వాన్, బొగ్గు, గనులు, పార్లమెంటరీ వ్యవహారాల శాఖమంత్రి ప్రహ్లాద్ జోషి, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ బిట్టు వారి చేతుల మీదుగా వరల్డ్ ఫుడ్ ఇండియా 2024 కార్యక్రమ వేదిక నుంచి దేవి ఫిషరీస్ లిమిటెడ్ వారి ఈ నూతన రొయ్యల ప్రోసెసింగ్ యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించారని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ వీర్రాజు మాట్లాడుతూ ఈ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా రెండు వేలు మందికి పరోక్షంగా వేలాదిమందికి జీవనోపాధి కలుగుతుందన్నారు. దేశాభివృద్ధిలో పరిశ్రమలు భాగస్వామ్యం కావడం గర్వకారణమన్నారు. తమ కేంద్ర కార్యాలయం కాకినాడలో వున్నప్పటికీ ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో తమ యూనిట్‌లను నెలకొల్పుతు న్నామని చెప్పారు. పర్యావరణ పరిరక్షణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తు నామని వివరించారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

విశాలాంధ్ర-ఏలూరు: స్వామి దయానంద సరస్వతి వసతి గృహంలో విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసిన శశి కుమార్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు మహిళా సంఘాలు తెలిపాయి. శుక్రవారం స్థానిక పవర్ పేట అన్నే భవన్ ఐద్వా కార్యాలయంలో మహిళా, విద్యార్థి సంఘాలు సంయుక్తంగా రౌండ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల, ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు జి. శారద, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహనరావు, కె. నాని తదితరులు మాట్లాడుతూ స్వామి దయానంద సరస్వతి వసతిగృహంలో విద్యార్థులపై జరిపిన లైంగిక వేధింపులకు గురిచేసిన శశి కుమార్ ను, సహకరించిన వార్డెన్, కేర్ టేకర్లు(జ్యోతి(శ్రీ),లావణ్యలను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈఘటన జరిగినా నేటికీ ప్రజాప్రతినిధులు స్పందించక పోవడం బాధాకరం అన్నారు. తక్షణమే దోషులపై ఫోక్స్ చట్టం అమలు చేయాలని, ఈకేసు తప్పుదోవ పెట్టకుండా సిబిఐతో విచారణ జరిపించాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దోషులు ఎంతటి వారైనా ఉపేక్షించరాదన్నారు.ఫోక్సో చట్టం అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లాకమిటీ సభ్యులు అరుణ, కుమారి, విద్యార్థి సంఘాల నాయకులు కె.నాని, క్రాంతి మాట్లాడారు.

రైతు శాస్త్రవేత్తల పనితీరు భేష్

విశాలాంధ్ర-ఏలూరు: రైతు సాధికార సంస్థ రూపొందించిన రైతు శాస్త్రవేత్తల కోర్సు, శాస్త్రవేత్తల పనితీరు అద్భుతం అని మెక్సికో ప్రతినిధి బృందం ప్రశంసించింది. సాధారణ రైతు కుటుంబాల నుంచి యువతీ యువకులను ఎంపిక చేసి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దడం వినూత్న విధానం అని కితాబునిచ్చింది. తమ మూడు రోజుల పర్యటనలో భాగంగా మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియానేటివిటీ నేతృత్వంలో మెక్సికో ప్రతినిధి బృందం శుక్రవారం జిల్లాలోని వివిధ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలలో పాలుపంచుకొంది. మెక్సికో బృంద సభ్యులు పెదవేగి మండలంలోని అమ్మపాలెం గ్రామంలో రైతు శాస్త్రవేత్తలు, మెంటార్ లతో ముచ్చటించారు. కోర్సు విధి విధానాలను, కోర్సులో నేర్చుకొన్న మెలకువలను, విజ్ఞానాన్ని వ్యవసాయ సాగుకు అనుసంధానించే విధానం, శాస్త్రవేత్తల రోజువారీ విధులు తదితర అంశాలను అడిగి తెలుసుకొన్నారు.మెక్సికో బృందం శుక్రవారం ముందుగా ఏలూరు మండలంలోని వెంకటాపురం గ్రామం ను సందర్శించి అక్కడ 10 మంది కౌలు రైతులు సమిష్టిగా 16 ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న వరి పంటను పరిశీలించారు. రైతు సాధికార సంస్థ సూచనల మేరకు కాంపాక్ట్ బ్లాక్ పేరుతో సరికొత్తగా నిర్వహిస్తున్న ఈ నమూనాలో గట్లను వెడల్పు చేయడం ద్వారా కూరగాయలు పండించి రైతులు అదనపు ఆదాయం పొందడం బృంద సభ్యులను ఆకర్షించింది. గట్లపై వేసిన కూరగాయల విక్రయం ద్వారా ఎకరాకు రూ.30 వేలను అదనంగా పొందుతున్నట్లు రైతులు తెలిపారు. వరి గట్లపై పండించిన రసాయన రహిత కూరగాయలను జిల్లా కలెక్టర్ కార్యాలయ సముదాయంలో విక్రయిస్తున్నామని, వరి పంట ఉత్పత్తులను శ్రీవారి నైవేద్యం, నిత్యాన్నదానం కోసం తిరుమల తిరుపతి దేవస్థానానికి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. రైతు సాధికార సంస్థ అధికారులు అరుణ,సురేష్, మధు ప్రీతి, సరోజ, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు, అదనపు మేనేజర్ వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ : ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఈ వందరోజుల పాలనలోనే రుజువైందని, ప్రజలు కూడా 'ఇది మంచి ప్రభుత్వం' అని సంతోషంగా చెబుతున్నారని కాకినాడ నగర ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు అన్నారు. కూటమి ప్రభుత్వ పాలన వంద రోజులు పూర్తయిన సందర్భంగా కాకి నాడ నగరపాలక సంస్థ పరిధిలోని 9, 10, 11, 12, 13 డివిజన్లలో శుక్రవారం సాయంత్రం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. కాకినాడ నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ మనోహర్ అధ్యక్షతన స్థానిక పర్లోపేట ఏఎంజీ స్కూల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు పుతో డిప్యూటీ కమిషనర్ మనోహర్ 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్లను ఆవిష్కరింపజేశారు. ప్రతి ఇంటి వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' స్టిక్కర్‌ను అతికించారు. అనంతరం ఏఎంజి పాఠశాలలో ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, కలెక్టర్ షణ్మోహన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కార్యదర్శి ఏసుబాబు, టీపీఆర్వో శైలజ ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జికె ఒలింపియాడ్‌లో
తనుశ్రీ కి స్టేట్ 3వ ర్యాంక్

విశాలాంధ్ర - రాజోలు : ఎడ్యుకేషన్ స్పెషల్ రాజమండ్రి ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్న గోదావరి జికె ఒలింపియాడ్‌లో మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలోని వివేకానంద ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాల విద్యార్థినీ సిహెచ్ తనుశ్రీ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ పివివి వర ప్రసాద్ శుక్రవారం తనుశ్రీని పుష్పగుచ్ఛము ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

ఘనంగా వైభవ లక్ష్మి వ్రతం

విశాలాంధ్ర - అనపర్తి : వైభవలక్ష్మి వ్రత పూజ సీనియర్ పాత్రికేయులు సత్తి శ్రీనివాసరెడ్డి చంద్రకళ దంపతులు భక్తి శ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం వేద పండితులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో వైభవలక్ష్మి వ్రత పూజా కార్యక్రమం జరిగింది. అనంతరం ప్రతం ఆచరిస్తే శాంతి, సుఖ సౌభాగ్యాలు, ఐశ్వర్యం, సంతానం, సుఖశాంతులు కలుగుతాయని భాస్కరాచార్యులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తి సుధాకర్ రెడ్డి బృందావతి, నల్లమిల్లి రామారెడ్డి పద్మావతి, టి సుబ్బారెడ్డి పార్వతి, తేతల శ్రీనివాస్ రెడ్డి పార్వతి, ఎస్ టి ఎన్ వి రామారెడ్డి కుమారి రమ్య, మల్లిడి సందీప్ రెడ్డి దివ్య దంపతులు, ఇంకా పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు.